

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఉమ్మడి వరంగల్

హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

శనివారం | 31 | మే | 2025 | పేజీలు : 16





# పల్లెలల్లో పంచాయితీ షురూ?

**జోరు మీదున్న ఆశావాహులు,**

**పార్టీ టికెట్ నాకంటే నాకంటూ ప్రచారం,**

**జూన్ లేదా జూలైలో స్థానిక పోరుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం,**

**ఇప్పటికే సర్వే చేయించిన అధికార పక్షం,**

**ప్రభుత్వంపై వ్యతిరేకతను తమవైపు మలుచుకుంటామంటున్న ప్రతిపక్షం**

**స్థానిక పోరుకు ఆసక్తి చూపుతున్న యువత,**

**గెలుపు గుర్రాల వేటలో పలు పార్టీలు,**

**స్వతంత్ర అభ్యర్థులుగానే బరిలో నిలుస్తామంటున్న యువకులు,**

పెద్దవంగర మే 30 (సూర్యా న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో రానున్నాయి. దాదాపు 16 నెలలుగా గ్రామాలలో సర్పంచులు లేక అభివృద్ధి కుంటుబడింది. ప్రభుత్వం ఇదిగో ఎలక్షన్ అదిగో ఎలక్షన్ అంటూ కాలం నెట్టుకొస్తుందే తప్ప, గ్రామ పంచాయతీల అభివృద్ధి పై దృష్టి పెట్టకుండా కాలయాపన చేస్తూ వస్తుంది. గ్రామాలలో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కనిపిస్తుంది. జూన్ లేదా జూలైలో పల్లెలల్లో పంచాయతీ షురూ అయినట్లేనని ఆశావాహులు ఎదురుచూస్తున్నారు.

### ఆ పార్టీ టికెట్ నాకేనంటూ గ్లోబల్ ప్రచారం?

సాధారణంగా ఏ ఎలక్షన్లోనైనా అధికార పార్టీ వైపే ప్రజలు మొగ్గ చూపుతారు.ఈ స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా అధికార పార్టీ వైపు టికెట్ సాధిస్తేనే విజయావకాశాలు మెండుగా ఉంటాయనే ఉద్దేశంతో ఆశావాహులు పలుమార్లు తమ తమ పార్టీల పెద్దలను కలుస్తూ ప్రసన్నం చేసుకుంటున్నారు.ఎలాగైనా టికెట్ నాకే వస్తుందని ఎవరికి వారే గ్లోబల్ ప్రచారం

మిగతా 2లో..


## రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నాం

**రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**

19,41 డివిజన్ లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

5లో





## ప్రజల్లో ధైర్యాన్ని కలిగించటానికే ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

8లో






## న్యాయం చేయండి
## కొనసాగుతున్న అరవింద్ దీక్ష



గీసుగొండ మే 30 మేజర్ న్యూస్ (సూర్య)తండ్రికి చెందిన ఆస్తి వాటా కోసం తనయుడు చేస్తున్న పోరాటం 5వ రోజుకు చేరింది.ఎలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన మిట్టపల్లి అరవింద్ తండ్రి శ్రీనివాస్ 2007లో మరణించాడు.కాగా తన తండ్రికి చెందిన ఆస్తి ఇవ్వడానికి చిన్నన్న ,పెద్ద నాన్న అడ్డుపడుతున్నారని తెలిపారు.ఇదే విషయమై గతంలో పంచాయితీ జరుగగా ఆస్తి ఇస్తామని చెప్పి,ఇప్పుడు మాట మార్చి అడ్డుపడుతున్నారని తెలిపారు.తన తండ్రికి రావాల్సిన ఆస్తిని తమకు ఇచ్చి న్యాయం చేయాలని ఆయన కోరారు.తల్లి స్వరూప,అమ్మమ్మతో కలసి అరవింద్ చేస్తున్న దీక్షకు పలువురు సంఘీభావం తెలుపుతున్నారు.

# పల్లెలల్లో పంచాయితీ షురూ?

మొదటి పేజీ తరువాయి..

మొదలుపెట్టి వర్గాలుగా విడిపోతున్నారు. అటు అధికార పక్షమే కాకుండా ఇటు ప్రతిపక్ష పార్టీలు కూడా మేము సైతం అంటూ అభ్యర్థులను బరిలో నిలిపి సత్తా ఏమిటో చూపెట్టాలని ఉవ్విల్లూరుతున్నారు.

### గెలుపు గుర్రాల వేటలో వివిధ పార్టీలు

ఇప్పటికే అధికార పార్టీ గ్రామాలలో రెండు దఫాలుగా ఆశావాహుల అభ్యర్థులపై సర్వేలు చేయించారు. ఈ సర్వేల రిపోర్టుతో పాటు అంగబలం, అర్థబలం ఉన్న అభ్యర్థులను మాత్రమే బరిలో నిలిపితే గెలుపు మనదే అనే ఆలోచనలో అధికార పక్షం ఉన్నట్టు సమాచారం. అధికార పక్షానికి దీటుగా ఆర్థిక బలం, రాజకీయ అనుభవం ఉన్నటువంటి అభ్యర్థిని బరిలో నిలిపితే గెలుపు మనదే అన్నట్లుగా ఆచితూచి ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

### అధికార పక్షమా , ప్రతిపక్షమా,లేక స్వతంత్రమా,?

స్థానిక పోరులో సర్పంచ్,ఎంపీటీసీ జడ్పిటిసి ఏ అభ్యర్థులైన అధికార పక్షం వైపు నిలబడితే గెలుపు నల్లేరుపై నడకేనని సాధారణంగా అందరూ అనుకుంటారు. కానీ ప్రతిపక్ష పార్టీలు మాత్రం అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను తమ వైపు ఓటు రూపంలో తిప్పుకోవచ్చనే భావనలో ఉన్నట్టు గుసగుసలు వినపడుతున్నాయి. మరికొందరు అటు అధికారపక్షం కాకుండా ఇటు ప్రతిపక్షాలు కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిస్తేనే ప్రజలు విశ్వసిస్తారని పార్టీలతో సంబంధం లేకుండా పార్టీ గుర్తులు కావు కాబట్టి సర్పంచ్ అంటేనే అభ్యర్థినీ బట్టి ఓటింగ్ జరిగే ఎలక్షన్ కాబట్టి అధికార ప్రతిపక్షం అభ్యర్థులకు దీటుగా ప్రజలలో మంచి పేరు ఉన్న అభ్యర్థులు ముఖ్యంగా యువత స్థానిక పోరుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.-స్థానిక పోరులో వివిధ పార్టీలు ఎక్కువ శాతం యువతకు అవకాశం కల్పిస్తారా లేక అంగబలం అర్థబలం ఉన్న అభ్యర్థులను బరిలో నిలుపుతారా అనే ఆసక్తికర విషయాలను త్వరలో తెలుసుకుందాం.

-ఓటర్లు స్థానిక పోరులో ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై అధికార పక్షం వైపు నిలబడతారా,?. లేక వ్యతిరేకతతో ప్రతిపక్షాల వైపు నిలుస్తారా? లేక పార్టీలతో సంబంధం లేకుండా స్వతంత్ర అభ్యర్థులను గెలిపిస్తారా? అనే ఆసక్తికర విషయాలు తెలియాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

# ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

**పరిసరాల పరిశుభ్రతపై**
**ఇంటర్ కాలేజి ప్రిన్సిపాల్ పై ఎమ్మెల్యే ఆగ్రహం**
**పాఠశాలనుంచి డిగ్రీ కళాశాల వరకు ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**కమిట్మెంటుతో పని చేసే వారినే ప్రోత్సహించడం జరుగుతుంది**
**మాజీ ఉప ముఖ్యమంత్రి,**
**స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



స్టేషన్ ఘనపూర్, మే 30,మేజర్ న్యూస్(సూర్య):ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందించినప్పుడే ప్రభుత్వ విద్యాలయాల్లో హాజరు శాతం పెరుగుతుందని మాజీ ఉపముఖ్యమంత్రి ,ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల తరగతుల నిర్వహణ నేపథ్యంలో విద్యార్థులకు కనీస వసతుల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులతో శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ముందుగా కళాశాలలో ప్రస్తుత పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే కళాశాల లో మౌలిక వసతుల కల్పన కొరకు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 31 కల్లా కళాశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.2025 -26 విద్యా సంవత్సరం నుండి డిగ్రీ కళాశాల తరగతుల నిర్వహణ ప్రారంభించుకోబోతున్నట్లు పేర్కొన్నారు.కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల కల నెరవేరిందన్నారు. మార్చి నెలలో 8 కోట్ల తో నూతన డిగ్రీ కళాశాలకు మంజూరు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. డిగ్రీ కళాశాలకు అవసరమైన అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ మొత్తం 26 మంది ఉపాధ్యాయుల ఏర్పాటుకు మంజూరు రావడం జరిగిందన్నారు. డిగ్రీ కకాశాలలలో బీఏ, బీకాం,కంప్యూటర్, బిఎస్సీ కంప్యూటర్,ఎంపీసీ,బిజడ్సి లైఫ్ సైన్సెస్,కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.మొత్తం 240 సీట్ల అడ్మిషన్ల కొరకు విద్యార్థులు ఆన్ లైన్ లో అప్లై చేసుకోవాలన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందుతారని తెలిపారు.నూతన డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం డిగ్రీ కళాశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వెంటనే టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, ఫ్యాన్స్, ఫర్నిచర్, డిజిటల్ బోర్డు, త్రాగునీరు సౌకర్యాలతో పాటు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.వచ్చే ఏడాది కల్లా శాశ్వత డిగ్రీ కళాశాల భవనం విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలియజేశారు. అందుకు సంబంధించి త్వరలోనే టెండర్స్ పిలవడం జరుగుతుందన్నారు. విద్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. కమిట్మెంట్ తో పని చేసే వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రాథమిక పాఠశాల నుండి డిగ్రీ కళాశాల వరకు ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులంతా కలిసి డ్రైవ్ చేపట్టి మౌలిక వసతులతో పాటు మంచి ఉత్తీర్ణత శాతం పెరిగే విధంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని విద్యాలయాల్లో మౌలిక వసతుల ఏర్పటు కోసం 10 కోట్ల వరకు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే తెలియజేశారు.అదే విధంగా కళాశాలలో పరిసరాల పరిశుభ్రత సరిగా లేకపోవడంతో అలాగే తాను పరిశీలినకు వచ్చేటంత వరకు కళాశాలలోని సమస్యలు తన దృష్టికి తీసుకు రాకపోవడంతో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, ఆర్డిఓ డిఎస్ వెంకన్న,తహసిల్దార్ వెంకటేశ్వర్లు,ఎంపీడీఓ విజయశ్రీ,మున్సిపల్ కమీషనర్ గొడిశాల రవీందర్,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, , జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజీ రెడ్డి,మండలాధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నీల రాములు, పీఏసిఎస్ డైరెక్టర్ తోట సత్యం, మాజీ ఎంపిటీసీ రజాక్ యాదవ్,గుర్రం రాజు, ఫాతి కుమార్, జిల్లా సీనియర్ నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి,నాగరబోయిన యాదగిరి తదితరులు పాల్గొన్నారు.





## నాణ్యమైన విద్యను ఉచితంగా పొందుదాం

### ఎం.పీ యు.పి.ఎస్ ప్రధానోపాధ్యాయుడు రవీందర్



చెన్నారావుపేట, మే 30 , మేజర్ న్యూస్ సూర్య : ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని చేర్పించి, నాణ్యమైన విద్యను ఉచితంగా పొందుదామని తల్లిదండ్రులకు ఎంపియుపిఎస్ ప్రధానోపాధ్యాయుడు రవీందర్, విద్య కమిటీ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని భోజేరువు గ్రామంలో ఉపాధ్యాయ బృందం, విద్యా కమిటీ నాయకులు ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మన ఊరు బడి పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పిద్దామని ప్రతి ఒక్క తల్లిదండ్రులు ముందుకు రావాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నేడు అన్ని సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులకు రెండు జతల యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ఉన్నారని ప్రభుత్వం కల్పించిన పదోన్నతుల ద్వారా పాఠశాలలో సబ్జెక్టులో ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ కుసుమ సతీష్, పేరెంట్ కమిటీ సభ్యులు నూకల కృష్ణ యాదవ్, ఉపాధ్యాయులు రాజు, పరమేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడికి వేద ఆశీర్వచనాలు



గీసుకొండ మే 30 మేజర్ న్యూస్ (సూర్య) టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్-కళ్యాణి దంపతులను గీసుగొండ మండలంలోని ప్రసిద్ధమైన ఊకల్ హవేలీలోని శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు,శ్రీహర్షలు హైదరాబాదులో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ దంపతులకు వేద ఆశీర్వాచనాలు అందించారు.కాగా టీపీసీసీ అధ్యక్ష పదవి రాకముందు,పదవి తర్వాత మహేష్ కుమార్ గౌడ్ ఊకల్ హవేలీ లోని నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

## అడిషనల్ డీసీపీగా భాధ్యతలు చేపట్టిన రాయల ప్రభాకర్ రావు



హనుమకొండ సూర్య ప్రతినిధి, మే 30, మేజర్ న్యూస్ సూర్య: వరంగల్ పోలీస్ కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ విభాగం అదనపు డీసీపీ గా రాయల ప్రభాకర్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు.ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ గా పనిచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బదిలీ పై వచ్చిన ప్రభాకర్ రావు గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఏసీపీ గా పనిచేయడం తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా లో వివిధ హోదాల్లో సమర్ధవంతంగా పనిచేశారు.



## స్మార్ట్ వాటర్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కొండా సురేఖ

వరంగల్ టౌన్, మే 30, మేజర్ న్యూస్ సూర్య: బల్దియా పరిధి 19 వ డివిజన్ లోని వివేకానంద కాలనిలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.50 లక్షల వ్యయం తో నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులకు శుక్రవారం రాష్ట్ర దేవాదాయ, అటవీ ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కార్పొరేటర్లు, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రేషన్ డీలర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు చేసిన తాసిల్దార్ సిహెచ్ నరేష్



నెల్లికుదురు మే30 మేజర్ న్యూస్(సూర్య): రేషన్ కార్డులో మంజూరు ప్రక్రియలో పారదర్శకతను పాటించాలని తహసిల్దార్ సిహెచ్ నరేష్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రం లోని తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ నరేష్ రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో పారదర్శకతను పాటించాలని,రేషన్ సరఫరా నిరాటంకంగా జరగాలని,లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు సరైన బరువుతో అందించాలని సూచించారు. నూతన రేషన్ కార్డులు రేషన్ అంశాలపైస్పష్టమైన మార్గదర్శకాలు చేశారు.ఈ కార్యక్రమంలో నయబ్ తహసిల్దార్ తరంగిణి,మండల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



## ధర్మవరం పట్టా ల్యాండ్ ఇసుక క్వారీలో భారీ అక్రమాలు

### అనుమతులు ఒకచోట... ఇసుక ర్యాంపు మరొకచోట

వాజేడు మే 30 మేజర్ న్యూస్ సూర్య :,ధర్మవరం ఇసుక ర్యాంపు పనులు ఆపాలని సిపిఎం,బిఆర్ఎస్ పార్టీల డిమాండ్ చేశాయి .పట్టాలాండ్ కావడంతో అనుమతులు లేని చోట అక్రమంగా ఇసుక తొలకాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న ,ధర్మవరం( పట్టా భూములు )ఇసుక ర్యాంపు గుత్తే దారులపై చర్యలు తీసుకోని,ఇసుక ర్యాంపు పనులు నిలుపుదల చేయాలనీ కోరుతూ,సిపిఎం, బిఆర్ఎస్ పార్టీలు ఆధ్వర్యంలో తహసీల్దార్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్బంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు,సిపిఎం పార్టీ జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంగిస్తూ ధర్మవరం( పట్టా భూముల )ఇసుక ర్యాంపు గూత్తేదారులు, అనుమతులు తీసుకున్న సర్వే నెంబర్ల లో కాకుండా అనుమతి లేని చోట, గోదావరి లో ఇసుక తవ్వకాలు పరిమితికి మించి తవ్వకాలు జరుపుతూ, తమ మండలానికి సంబందించిన సహజ వనరులను కొల్ల గొడుతూ,ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతూ,ప్రభుత్వాన్ని,మండల ప్రజానీకాన్ని మోసం చేస్తున్న ఇసుక ర్యాంపు గుత్తేదారులపై చర్యలు తీసుకోని, ర్యాంపు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో చేప లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## నిశ్చితార్థం వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



చెన్నారావుపేట, మే 30 , మేజర్ న్యూస్ సూర్య : మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన మాజీ వార్డ్ సభ్యులు రజిత సదయ్య దంపతుల కుమార్తె సౌమిక -విష్ణు వర్ధన్ ల నిశ్చితార్థం వేడుకలను నెక్కొండ మండలంలోని సుమంగలి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం వివాహ వేడుకకి హాజరైన కాంగ్రెస్ నాయకులు నవ దంపతులను ఆశీర్వదించారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేన రమేష్ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్ నాయకులుమాజీ వార్డు సభ్యులు బరిగెల సారయ్య ఐత తిరుపతి ఆకుల పెళ్లి భిక్షపతి జన్ను స్వామి సౌరబ్ రాకేష్ ఐత రాంమోహన్ బరిగెల మహేష్ ఆకుల పెళ్లి రవి కుమార్ బరిగెల రవి రాకేష్ రాజేందర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ ఆమోదిత కంపెనీ విత్తనాలను మాత్రమే విక్రయించాలి

### డివిజన్ సహాయవ్యవసాయసంచాలకులు శ్రీనివాసరావు

### వర్షాకాలం విత్తన,ఎరువుల అమ్మకాలపై అవగాహన సదస్సు



నెల్లికుదురు మే30 మేజర్ న్యూస్(సూర్య) ప్రభుత్వ ఆమోదిత కంపెనీ విత్తనాలను మాత్రమే విక్రయించాలనిఎరువుల విత్తనడీలర్లకు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ శ్రీనివాసరావుసూచించారు.శుక్రవారం వ్యవసాయ రెవిన్యూ,పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారియాస్మిన్ మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన ఎరువుల పురుగుల మందుల డీలర్లకు వర్షాకాలంవిత్తన ఎరువుల అమ్మకాలపై అవగాహనసదస్సునిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూవిత్తన ఎరువులు పురుగుల మందులు విక్రయించేటప్పుడుస్టాక్ బుక్కులో బిల్ బుక్కులు సక్రమంగా నిర్వహించాలని, ఎరువుల దుకాణాలకు స్టాక్ బోర్డులు,ధరల పట్టికను పెట్టాలని సూచించారు. ఎంఎఓయాస్మిన్ మాట్లాడుతూప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తేచట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.గ్రామాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు లూజు పత్తి విత్తనాలను, అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే పోలీసు శాఖకు సమాచారం అందివ్వాలని అన్నారు. ప్రభుత్వ అనుమతిపొందినవిత్తనాలనునాణ్యమైన ధరలకు విక్రయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయసహకార సంఘం నిర్వాహకులు,ఆగ్రోస్ సేవ కేంద్రం నిర్వాహకులు, మండలంలోని ఎరువుల విత్తనాలడీలర్లు తదితరులు పాల్గొన్నారు.




## రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్

ములుగు, సూర్యప్రతినిధి మే 30 (మేజర్ న్యూస్): పంటల సాగు ప్రారంభంకానున్న నేపథ్యంలో రైతులకు పంట రుణాలు సమయానికి, రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారుల సకాలంలో రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శుక్రవారం బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో పేద, మధ్య తరగతి కుటుంబాలు వ్యవసాయం, తదితర రంగాల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటాయి. అలాంటి వారికి రుణాలు ఎంతగానో అవసరం. బ్యాంకుల ద్వారా మంజూరు కాకుంటే అధిక వడ్డీకి బయట అప్పుచేసి పెట్టుబడి పెడితే కష్టార్జితం మొత్తం అప్పులకు కట్టే వడ్డీకే సరిపోతుందని, రాజీవ్ యువ వికాసం పథకం అమలులో బ్యాంకుల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి బ్యాంకర్ల ద్వారా దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం, ఎంపికైన లబ్ధిదారుల జాబితా బ్యాంకులకు వచ్చిన వెంటనే ఏలాంటి ఆలస్యం లేకుండా యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల కోసం కాస్మెటిక్ చార్జీలు నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేయ డానికి బ్యాంక్ శాఖలు విద్యార్థులకు బ్యాంక్ ఖాతాలు తెరవాలని, డెబిట్ కార్డులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు జెసి సంపత్ రావు, రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధి గోమతి, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఎస్బిఐ వరంగల్ రీజినల్ మేనేజర్ సుబ్బారావు రూరల్, ఎస్సీ కార్పొరేషన్ తుల రవి, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్ రెడ్డి, డిసిఓ సర్దార్ సింగ్, బ్యాంకర్స్, ఆయా సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ అర్బన్, మే 30, మేజర్ న్యూస్ సూర్య: దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ కి సంబందించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ కి సంబందించి అలాగే ప్యాకేజి 7 నవాబ్ పేట రిజర్వాయర్, చీటకోడూరు రైట్ మెయిన్ కెనాల్, అశ్వరావుపల్లి రైట్ మెయిన్ కెనాల్ భూసేకరణ పనులను అలాగే నష్ట పరిహారం చెల్లింపులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు నేషనల్ హైవే 365 బి కి సంబందించి భూ సేకరణ, నష్ట పరిహారం చెల్లింపుల ను కూడా వేగవంతం చేయాలన్నారు సమావేశం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, ఆర్డీఓ లు, ఇరిగేషన్, నేషనల్ హైవే ఈ ఈ, డి. ఈ లు తదితరులు పాల్గొన్నారు



# భూభారతిని అవగాహనతో నిర్వహించాలి



### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

జనగామ అర్బన్, మే 30, మేజర్ న్యూస్ సూర్య:భూ భారతి ని అవగాహనతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు... శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో భూభారతి పోర్టల్ పై అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్ సింగ్ తో కలిసి కలెక్టర్ తాసిల్దార్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా భూభారతి పోర్టల్ లో సూచించిన విధంగా ఒక్కొక్క అంశాన్ని వివరంగా వివరిస్తూ వాటిపై తాసి ల్దార్లకు అవగాహన కల్పించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిం చాలని సజావుగా పూర్తి చేస్తూ వేగవంతంగా చేపట్టాలన్నారు.రెవెన్యూ సదస్సులపై పంచాయతీ సెక్రటరీలకు షెడ్యూల్ పంపడం జరిగిందని ఒకరోజు ముందుగానే సంబంధిత గ్రామంలో టామ్ టామ్ చేయించేలాగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముందుగా స్వీకరించిన దరఖాస్తులను సబ్జెక్టుల వారిగా విభజించుకోవాలని తద్వారా వేగవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలో గానే పూర్తి చేయాలన్నారు. సంబంధిత గ్రామాలకు వెళ్లి అధికారులకు ఆయా గ్రామాల భూ రికార్డులు తప్పని సరిగా వెంట తీసుకువెళ్లాలని సూచించారు.



అవగాహన కార్యక్రమంలో జనగామ ఆర్డీఓ గోపి రామ్, డిప్యూటీ కలెక్టర్ హనుమంత నాయక్, తాసిల్దార్లు డిప్యూటీ తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలస్యం చేయకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలి

### సరిపడా హమాలీలను ఏర్పాటు చేసుకోవాలి

### రైతులను ఇబ్బందులకు గురి చెయ్యొద్దు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



గణపురం రూరల్ మే 30 మేజర్ న్యూస్ సూర్య: రైస్ మిల్లు యజమానులు సకాలంలో ధాన్యం దిగుమతి చేసుకోవాలని రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.శుక్రవారం గణపురం మండలం లక్ష్మారెడ్డి పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, గణపురం మండలం బుర్రకాయల గూడెంలోని ధనలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. మొదటగా లక్ష్మారెడ్డిపల్లెలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యపు తేమ శాతాన్ని పరిశీలించి నిర్దేశిత



శాతం తేమ ఉండే విధంగా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. గణపురం మండలం బుర్రకాయలగూడం వద్ద ధనలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్ ని పరిశీలించి మిల్లర్ తో మాట్లాడారు.రైతులకు ఇబ్బందులు కలకుండా వాహనాల ద్వారా వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని, అందుకు తగినంత మంది హమాలీలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తేమ శాతాన్ని పరిశీలించాలని రైతులను ఇబ్బందులకు గురి చేయెద్దని ప్రతి రైస్ మిల్లు వద్ద రెవెన్యూ శాఖ అధికారులు ఏర్పాటు చేసి దాన్యం వాహనాలు రోజుల తరబడి ఉంచొద్దని తక్షణమే దిగుమతి అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.శుక్రవారం వరకు 12,319 మంది రైతుల నుండి 74,425 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు జరిగినట్లు తెలిపారు. గత సంవత్సరం ఈ సీజన్ లో 43,990 మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగిందని గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం ఎక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోలు జరిగినట్లు తెలిపారు. దాన్యం కొనుగోలు విలువ 172.66 కోట్లు కాగా ఇప్పటి వరకు 79.68 కోట్లు చెల్లింపులు జరిగాయని అన్నారు. గత సంవత్సరం ఈ సీజన్ నాటికి కొనుగోలు చేసిన దానికంటే ఈ సీజన్ లో 30435 మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పౌర సరఫరాల అధికారి శ్రీనాధ్, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర అభివృద్ధి ధ్యేయం గా పనిచేస్తున్నాం



వరంగల్, మే 30, మేజర్ న్యూస్ సూర్య: రాష్ట్ర అభివృద్ధి ధ్యేయం గా పనిచేస్తున్నామని రాష్ట్ర అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్ (తూర్పు)నియోజక వర్గ పరిధి లోని 19 డివిజన్ వివేకానంద కాలనీ లో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులతో పాటు 41 వ డివిజన్ లో ఎస్ డి ఎఫ్ నిధులు రూ.34 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నేడు శంకుస్థాపన నిర్వహించిన పనులతో పాటు ఇంకా శంకుస్థాపన నిర్వహించాల్సిన పనులు చాలా ఉన్నాయని తాము అధికారంలోకి వచ్చిన తర్వాతనే మళ్ళీ కొత్త రోడ్లు వేయడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య ఉన్న మేయర్ జిల్లా కలెక్టర్ కమిషనర్ లు వెంటనే స్పందించి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రి రూ.10 కోట్ల ఎస్ డి ఎఫ్ ఫండ్ అందించారని గుర్తు చేసిన మంత్రి మరో 5 కోట్ల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వచ్చే నిధులను అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తామని అన్నారు. వెల్ఫేర్ ఆక్టివిటీస్ లో భాగంగా మహిళలకు రైతులకు వేర్వేరుగా అనేక రకాల అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని , యువత కోసం రాజీవ్ యువ వికాసం అనే కొత్త పథకాన్ని తీసుకురావడం జరిగిందని, సన్న బియ్యం పథకాన్ని కూడా తీసుకురావడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి విద్య వైద్యం సంక్షేమాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ ను ముందుకు తీసుకు వెళ్లడానికి కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రితో పాటుగా క్యాబినెట్ మంత్రులుగా ఉన్న తాము స్థానికంగా ఉన్న నాయకులు ప్రజాప్రతినిధులు కృషి చేస్తూ ప్రజలకు అనుకూలంగా పనులు జరిగే విధంగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

జూన్ 6వ తేదీన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ కూడా రాబోతున్నాయని అనంతరం ఆ కార్యక్రమాన్ని నిర్విరామ గా కొనసాగించడం జరుగుతుందని అన్నారు. ఇళ్ళు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి ,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా ఇన్చార్జ ఎస్ఇ శ్రీనివాస్, తాసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు ,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు2

# ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి



దంతాలపల్లిమే 30 మేజర్ న్యూస్ (సూర్య): మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖి లలో భాగంగా వారు ఫర్టిలైజర్ గోడౌన్స్ ను పరిశీలించి స్టాకు వెరిఫికేషన్ చేయడం జరిగింది. అదేవిధంగా విత్తనాల అమ్మకం ప్రారంభమైనందున విత్తన డీలర్లు అందరూ తప్పకుండా రసీదులను రైతులకు అందించాలని,స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు మైంటైన్ చేస్తూ ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు





సూచించడం జరిగింది. విత్తనాలు కొనుగోలు చేసే రైతులందరూ తప్పకుండా లైసెన్స్డ్ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఇతర వ్యక్తుల వద్ద తీసుకోకూడదని తెలియచేయడం జరిగింది. ఈ తనిఖీలలో భాగంగా వారి వెంట మండల వ్యవసాయ అధికారి మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**-ఎంపీ బలరాం నాయక్**

**-రైల్వే స్టేషన్ లో పనులను పరిశీలించిన ఎంపీ**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, మే 30,మేజర్ న్యూస్ (సూర్య): రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మహబూబాబాద్ ఎంపీ పోరికా బలరాం నాయక్ పరిశీలించారు.మహబూబాబాద్ జిల్లా రైల్వే స్టేషన్ లో జరుగుతున్న ప్లాట్ ఫామ్ అభివృద్ధి పనులను ఎంపీ పోరిక బలరాం నాయక్ శుక్రవారం పరిశీలించారు.రైల్వే స్టేషన్ పనుల్లో జరుగుతున్న జాప్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. అనంతరం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పలు సమస్యలపై రైల్వే జీఎం తో ఫోన్ లో మాట్లాడారు.ఎంపీ వెంట యువజన కాంగ్రెస్ నాయకులు గూగులోత్ వంశీ నాయక్,మాలోత్ అరుణ్ నాయక్,విక్రమ్,హాసేన్,ముజ్జు తదితరులు ఉన్నారు.

# గ్రామ పరిపాలన అధికారుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, మే 30,మేజర్ న్యూస్ (సూర్య): మహబూబాబాద్ జిల్లాలో గ్రామ పరిపాలన అధికారి పోస్టులకు జీపివో 130 మంది హాజరు కాగా నూట పదిమంది అర్హత సాధించిన్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. బ్రహ్మచారి తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 103 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం పూర్తి అయ్యింది. ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చిన తర్వాత వారికి గ్రామాలకు కేటాయించబడునని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ లో కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపర్డెంట్ మదన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీస్తును అనుసరించి చెడు మార్గం విస్మరించాలి

### పాస్టర్ రెవరెండ్ ఇమ్మడి ఆంధ్రయ



వర్ధన్నపేట మే 30 మేజర్ న్యూస్ సూర్య : యువత చెడు మార్గాలను విస్మరించి క్రీస్తును అనుసరించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని వర్ధన్నపేట ఎన్ఐసిజీవో పాస్టర్ రెవరెండ్ ఇమ్మడి ఆంధ్రయ అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎన్ఐసిజీవో చర్చిలో యూత్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ యూత్ ఫెస్టివల్ కు మినిస్ట్రీ యూత్ స్పీకర్స్ అభిషేక్ చాకో, జెర్మియా ఫెబ్, థామస్, టామ్ లు ముఖ్యఅతిథిలుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చర్చ్ పాస్టర్ రెవరెండ్ ఇమ్మడి ఆంధ్రయ మాట్లాడుతూ యువత ప్రయాణించాల్సిన మార్గం, దేశాభివృద్ధిలో యువత యొక్క పాత్ర అనే అంశాలపై యూత్ ఫెస్టివల్ లో వివరించారు. యువత చెడుమార్గంలో నడవకుండా మంచి మార్గంలో ప్రయాణించాలని సూచించారు. చెడు వ్యసనాలను విస్మరించి మంచి సంకల్పంతో జీవిస్తూ సమాజ సేవలో గుర్తింపు పొందాలన్నారు. సన్మార్గంలో నడిచేందుకు క్రీస్తు బోధనలు అనుసరించి సన్మార్గంలో అనుసరించాలని అన్నారు. నేటి యువత దేశాభివృద్ధి కోసం ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. మద్యపానం, సిగరెట్, గుట్కా, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో కొండేటి వెంకటేశ్వర్లు, సిలువేరు ఆనందం, కొండేటి కుమారస్వామి, గాయల సుమన్, కొండేటి దీవెన్, టైసన్, సతీష్ పాల్, అభిలాష్, పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో మంత్రి దుద్దిళ్ళ జన్మదిన వేడుకలు



మల్హార్, మే30 మేజర్ న్యూస్ సూర్య : తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు 56 జన్మదిన వేడుకలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు పులిగంటి సురేష్, జనగామ సంతోష్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఇతర రాష్ట్రాలకు దీటుగా తెలంగాణను అన్ని రంగాల్లోనూ తన ప్రత్యేకతను చాటుతూ అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం యూనివర్సిటీ ప్రాంగణంలో ఆహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

# పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

### ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు - నమిండ్ల చిన్నస్వామి

### గొర్రెకుంటలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం




గీసుగొండ మే 30 మేజర్ న్యూస్ (సూర్య): సమాజంలో కుల వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు నమిండ్ల చిన్నస్వామి అన్నారు.శుక్రవారం 15 వ డివిజన్ గొర్రెకుంటలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహిం చుకొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యులు నమిండ్ల చిన్నస్వామి మాట్లాడుతూ ప్రతి నెల 30వ తేదీన జరిగే పౌర హక్కుల దినోత్సవం సద్వినియోగం చేసుకోవాలని, గ్రామంలో ఉన్న సమస్యలను,సంక్షేమ పథకాల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.దళితులు రాజకీయంగా,ఆర్థికంగా ఎదిగేందుకు తోటి వారు సహకరించాలన్నారు.అనంతరం గీసుగొండ ఎస్.ఐ ప్రశాంత్ బాబు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు,మందుకి బానిసై చెడు మార్గంలో వెళ్లొద్దని,యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్ ఐ శ్రీధర్,ఆబ్కారీ పరకాల ఎస్ఐ వై.జ్యోతి ,మెడికల్ ఆఫీసర్ కె.అరుణ్ కుమార్, జిడబ్ల్యుఎంసీ కాశీబుగ్గ సర్కిల్ ఆర్ ఓ శ్రీనివాస్,ఆర్ ఐ సునీల్,అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ బందెల,నమిండ్ల క్లెమెంట్ ,సిలువేరు రవి, ల్యదేళ్ళ సంపత్ ,ఎలగొండ ప్రవీణ్ ,జన్ను నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దుచేసి పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తాం

### డి.ఎస్.పి రామ్మోహన్ రెడ్డి, ఏవో పౌర్ణిమ

కాటారం, మే 30, మేజర్ సూర్య న్యూస్: నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దుచేసి పీడియాట్ కింద కేసులు నమోదు చేస్తామని కాటారం డిఎస్పి జి రామ్మోహన్ రెడ్డి, ఏవో పూర్ణిమ అన్నారు. మండల కేంద్రంలోని లావణ్య ఫెర్టిలైజర్, శ్రీ రాజరాజేశ్వర ఆగ్రో మాల్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు అందరూ విధిగా రిజిస్టర్ లను అప్డేట్ చేయాలని, స్టాక్ బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. విత్తన ప్యాకెట్లపై ధరలు, గడువు కాలం విత్తనాల నాణ్యతతో పాటు స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాల లైసెన్సులు రద్దుచేసి పీడియాక్టీ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు రసీదు లేకుండా విత్తనాలు కొనుగోలు చేయరాదని తెలిపారు. విత్తన డీలర్స్ అందరూ పీడీ యాక్ట్ 1966 లోబడి వ్యాపారం చేసుకోవాలని సూచించారు.





బిజీ 3 విత్తనాలను విక్రయించవద్దని సూచించారు. గుడ్డ సంచులలో విత్తనాలు అమ్మ రాదని, విత్తనం అమ్మిన ప్రతి రైతుకి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. రైతులు దళారులు నమ్మి మోసపోవద్దని, లైసెన్సు ఉన్న దుకాణాలలో విత్తనాలు రసీదుతో తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అభినవ్, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శన**

కాటారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గారేపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి , ఎస్సై అభినవ్ పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంకుశ పూర్ గ్రామంలోని అన్నపూర్ణ బాయిల్ రైస్ మిల్లును సందర్శించారు. రైస్ మిల్ యజమానులు తరుగు పేరట రైతులను మోసం చేయవద్దని రైస్ మిల్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో ఎడ్ల సతీష్, గోపి గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఒక్క వరం

### పేద ప్రజల సంక్షేమమే

### కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట మే 30 మేజర్ న్యూస్ సూర్య:ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్య తరగతి ప్రజలకు ఒక్క వరంగా మారిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నివాస క్యాంప్ కార్యాలయంలో వర్ధన్నపేట టౌన్ 2వ వార్డుకి చెందిన వడ్లకొండ సాయి చరణ్ లివర్ సమస్య తో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి 45 లక్షల ఖర్చు చేసిన కూడ మరణించగా ఆ సమాచారం తెలియగానే ఎమ్మెల్యే నాగరాజు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో మొదటి సారిగా గొప్ప ఆలోచనతో ఏకంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.6 లక్షల రూపాయల మంజూరు చేసి గురువారం చెక్కును లబ్ధిదారునికి ఎమ్మెల్యే నాగరాజు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్రెడ్డి అర్హులందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి బిల్లులను సకాలంలో చెల్లిస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యం తో బాధపడుతున్నారని వారికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వివిధ ఆస్పత్రులలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధితులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు మైస




సురేష్, కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, కిషోర్, టౌన్ మాజీ కౌన్సిలర్లు సమ్మెట్ట సుధీర్, మంచాల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి జరిమానా

## పోచమ్మ మైదాన్ నుండి సి కే ఎం కళాశాల వరకు తనిఖీలు

వరంగల్ టౌన్, మే 30, మేజర్ న్యూస్ సూర్య: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న రెండు దుకాణాలకు జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పరిధి లోని 22వ డివిజన్ పోచం మైదానం జంక్షన్ నుండి సికెఎం కాలేజి వరకు గల కమర్షియల్ ఏరియాలలోని దుకాణాలు, వ్యాపార సముదాయాలలో నిషేధిత సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న రెండు దుకాణా లకు రూ.1500





పెనాల్టీ విధించడం జరిగిందని తెలిపారు. బల్దియా పరిధి లో నిషేధిత సింగిల్ యూజ్ వినియోగం, విక్రయానికి అనుమతి లేదని వ్యాపారస్తులు, దుకాణదారులు గాని సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించ రాదని పేర్కొన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగించే సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ వాడ కాన్ని పూర్తిగా నిర్మూలించాలని, దుకాణదారులు, వ్యాపార సముదాయాల యజమానులు తమ వద్దకు వచ్చే ప్రజలకు క్లాత్ బ్యాగ్స్ తెచ్చుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్ పి భాస్కర్ , ప్లాస్టిక్ ఎన్ఫోర్స్మెంట్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### -అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి,మే 30, మేజర్ న్యూస్ (సూర్య): పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనిఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి సూచించారు. అదనపు కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహబూబాబాద్ పట్టణం జిల్లా పరిషత్ హై స్కూల్ బాలికలు లో పరీక్షా కేంద్రం కలదని, జూన్ 03 తేదీ నుండి 13 వ తేదీ వరకు ఉదయం 9:30 నుండి 12:30 వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు అరగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షా కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ పరికరాలు సెల్ ఫోన్స్ క్యాలిక్యులేటర్ తదితర వస్తువులనుఅనుమతించబడవని తెలిపారు.పరీక్ష జరుగు సమయంలో ఆ ప్రాంతంలో అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయడం జరుగుతుందని, 144 సెక్షన్ విధించడం జరుగుతుంద న్నారు. పరీక్షా కేంద్రంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, త్రాగునీరు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ సిబ్బంది సానిటేషన్ చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాలని ఆయన కోరారు, ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఏసిజి శ్రీరాములు,రూరల్ సీఐ, స్థానిక తాహసిల్దార్ ఆర్టీసీ డిఎం శివప్రసాద్, పోస్ట్ ఆఫీస్ సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## వంద రోజుల ప్రణాళికను పక్కా గా అమలు చేయాలి

### నగర మేయర్ గుండు సుధారాణి



వరంగల్ టౌన్, మే 30, మేజర్ న్యూస్ సూర్య: ప్రభుత్వ ఆదేశానుసారం బల్దియా ద్వారా రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కా గా అమలు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు.బుధవారం బల్దియాలోని మేయర్ ఛాంబర్ లో వందరోజుల ప్రణాళిక అమలు చేయు తీరుపై మేయర్ అధికారులతో సమీక్షించి సమర్ధవంతంగా అమలు పరచుటకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జూన్ రెండవ తేదీ నుండి సెప్టెంబర్ 9వ తేదీ వరకు బల్దియా ద్వారా 100 రోజుల పాటు చేపట్టే కార్యక్రమాల గురించి వివరిస్తూ బల్దియా వ్యాప్తంగా పచ్చదనం పరిఢవిల్లేలా 100 రోజుల కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, వర్షాకాలంలో నగరం ముంపు నివారణ చర్యలు భాగంగా గ్రేటర్ వరంగల్ లోని 36 ప్రధాన నాలాల్లో 121 లక్షల రూపాయల వ్యయంతో కొనసాగుతున్న పూడికతీత పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రచారం నిమిత్తం గోడలపై రాతలను మృనాల్ పెయింటింగ్ లను వెయ్యడం ప్రదేశాలు గుర్తించాలని, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యల్లో భాగంగా నాలాలలో ఉన్న బ్లాకే జ్ ప్రాంతాలను గుర్తించి మెష్ లు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో రెండు జంక్షన్ లను అభివృద్ధి సుందరీకరణ చేయాలని, హనుమకొండ లోని బాలసముద్రం, వరంగల్ లో ఒక్కొక్కటి చొప్పున రెండు పార్కులను అభివృద్ధి చేయాలని, రహదారుల మరమ్మత్తులు ఏర్పడే గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి ఎలాంటి ప్రాణం నష్టం ప్రజలకు జరగకుండా చర్యలు తీసుకుంటూ, నోటీసులు జారీ చేసి శిథిలావస్థ నిర్మాణాలను తొలగించాలని, ఆరేళ్ల ద్వారా భువన్ సర్వే నిర్వహించాలని, డిఆర్ఎఫ్ సిబ్బంది తగినంత ఎక్విప్మెంట్, డి వాటరింగ్ పంప్స్, బోట్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పారిశుధ్యం ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తూ అంతర్గత మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.అన్ని మంచినీటి వనరులను పరిశుభ్రం చేయాలని, జిడబ్లుఎంసి లోని 125 ఈఎస్ఎల్ఆర్ లను, వాటర్ ట్రీట్మెంట్ క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ లెవెల్స్ పరిశీలించాలన్నారు.సమావేశంలో అదనపు కమిషనర్ జోన, సి ఎం హెచ్ ఓ రాజిరెడ్డి, ఇన్చార్జి ఎస్ ఈ శ్రీనివాస్, ఇంచార్జ్ సిపి రవీందర్ రాడేకర్, ఉప కమిషనర్ ప్రసన్నారాన్ని, డిఎఫ్ శంకర్ లింగం డీఈలు,ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## డీసీపీ జనార్ధన్ సేవలు స్ఫూర్తిదాయకం

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

హనుమకొండ సూర్య ప్రతినిధి, మే 30, మేజర్ న్యూస్ సూర్య: క్రైమ్స్ డీసీపీ జనార్ధన్ నేటి తరం పోలీస్ అధికారులకు స్ఫూర్తిదా యకంగా నిలిచిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. నేడు డీసీపీ గా పదవీ విరమణ చేస్తున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్ డీసీపీ బి.జనార్ధన్ వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సి పి మాట్లాడుతూ ఎస్.ఐ గా పోలీస్ శాఖలో చేరి నేడు డీసీపీ హోదా లో పదవీవిరమణ చేస్తూ, ఎన్నో విభాగాల్లో పనిచేసి క్లిష్టమైన కేసులను పరిష్కరించి నేటి తరం పోలీసులకు డీసీపీ జనార్ధన్ ను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.



## లబ్దిదారులందరికి రేషన్ బియ్యం అందజేయాలి

### స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో డి ఎస్ వెంకన్న



స్టేషన్ ఘనపూర్,మే 30,మేజర్ న్యూస్(సూర్య): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జూన్ 1 నుంచి 30 వరకు ఒకేసారి అందిస్తున్న జూన్,జులై ,ఆగస్టు మూడు నెలల రేషన్ బియ్యం లబ్దిదారులందరు సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో డిఎస్ వెంకన్న అన్నారు .స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు.రేషన్ బియ్యానికి సంబందించిన వివరాలు డీలర్లు ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డులో ప్రదర్శించాలని సూచించారు.లబ్దిదారులందరికి బియ్యం అందజేయాలని ఎటువంటి తప్పిదాలు దొర్లిన చర్యలుంటాయని హెచ్చరించారు.ఈ విషయంపై నిత్యంఅధికారుల తనిఖీ ఉంటుందన్నారు.అదేవిధంగా షాపు ముందు బ్యానర్లు,వాల్ పోస్టర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.మూడు నెలల రేషన్ బియ్యం ఇచ్చే విషయంపై ఆయా గ్రామాలకు సంబంధించిన పంచాయతి కార్యదర్శులు గ్రామ ప్రజలందరికి తెలిసే విధంగా చాటింపు చేయించాలని ఆర్డీవో తెలియజేసారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే ప్రతి ఒక్కరికీ న్యాయం

### మంత్రి కొండా సురేఖ

### వరంగల్ లో ప్రజా సమస్యలు పరిష్కరించిన మంత్రి

వరంగల్, మే 21, మేజర్ న్యూస్ సూర్య: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, బడుగు బలహీన వర్గాల జీవితాలలో వెలుగు నింపడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి వినతిపత్రాలు మంత్రి కొండా సురేఖ స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని వివిధ వర్గాల ప్రజలు హనుమకొండలోని తమ నివాసానికి చేరుకొని సమస్యలు మంత్రి సురేఖకి విన్నవించారు. ప్రతి సమస్య వింటూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతూ మంత్రి సురేఖ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల సంక్షేమం అభివృద్ధిలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల ముందుకు సాగుతున్నాయని తెలిపారు.





# ప్రజల్లో ధైర్యాన్ని కలిగించటానికే ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

హనుమకొండ సూర్య ప్రతినిధి, మే 30, మేజర్ న్యూస్ సూర్య: ప్రజలకు ధైర్యాన్ని కలిగించాటానికే ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహిస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. శుక్రవారం హన్మకొండ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని జెండా ఊపి ఈ కవాతు ప్రారంభించారు. హన్మకొండ బస్టాండ్, బ్రాహ్మణ వాడ, అలంకార్ జంక్షన్, హన్మకొండ చౌరస్తా మీదుగా అశోక జంక్షన్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం వరంగల్ పోలీస్ కమిషనరరేట్ పరిధిలో ఏడు రోజుల పాటు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కవాతు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కవాతు ముఖ్య ఉద్దేశం ఎలాంటి అల్లర్లు, మత ఘర్షణ లు తలెత్తిన తక్షణమే స్పందించి స్థానిక పోలీసులకు సహకారం అందిస్తూ ప్రజలకు శాంతి భద్రతలపై భరోసా కల్పించడమే లక్ష్యంగా కవాతు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఆర్. ఏ. ఎఫ్ డిప్యూటీ కామాండెంట్ సరస్వతి, హన్మకొండ ఏసీపీ నరసింహారావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్లు సతీష్, రవికుమార్, సత్యనారాయణ రెడ్డి తో పాటు ట్రాఫిక్, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








## జూన్ 1న నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలి

### హెచ్ఆర్ జె ఆర్ ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి



తొర్రూర్ మే 30 మేజర్ న్యూస్ (సూర్య) : తొర్రురులో ఉచిత వైద్య శిబిరం – జూన్ 1న హెచ్ ఆర్ జె ఆర్ ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ట్రస్టు చైర్మన్ అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో, హెచ్ ఆర్ జె ఆర్ ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్, అజరా హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన ఆదివారం తొర్రురులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని ట్రస్ట్ ఫౌండర్ ఛైర్పర్సన్ హనుమాండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి విషయాన్ని వెల్లడించారు.ఈ వైద్య శిబిరం జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని. శిబిరంలో అనేక విభాగాల్లో ప్రముఖ వైద్యులు తమ సేవలు అందించనున్నారని తెలిపారు. ముఖ్యంగా జనరల్ మెడిసిన్, షుగర్, బీపీ, ఈసీజీ, థైరాయిడ్, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు, పిల్లల వైద్యం, కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాల పంపిణీ, చర్మ నరాల సంబంధిత వైద్యం, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అదేవిధంగా, అవసరమైన మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాన్ని పాలకుర్తి నియోజకవర్గ సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరిస్థితిని పరీక్షించుకోవాలని ఝాన్సీ రెడ్డి తెలిపారు.

## ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



భూపాలపల్లి, టౌన్ మే 30 మేజర్ న్యూస్ సూర్య: యువజన కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఐటి శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు 56 జన్మదిన వేడుకలు శుక్రవారం జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్ లో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బడిదల ప్రసాద్ అను తరుణ్ రాజు అఖిల్ ప్రవీణ్ తిలక్ వినోద్ మధుకర్ అశోక్ వీరేందర్ శివ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాలను తనిఖీ చేసిన మండల టాస్క్ ఫోర్స్ టీం..



కేసముద్రం, మే 30 : కేసముద్రం మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న, ఎస్ఐ మురళీధర్ రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం కేసముద్రం మండల టాస్క్ ఫోర్స్ టీం మండలంలోని పలు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలలో ఉన్న వివిధ రకాల కంపెనీ విత్తనాలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు,ఇన్వైసులు లైసెన్సులు, స్టాక్ బోర్డు, గోదామును తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..డీలర్లు విత్తన చట్టం 1966 ప్రకారం వారి యొక్క క్రయవిక్రయాలు జరుపుకోవాలని,ప్రతి రైతుకు విధిగా బిల్లులు ఇవ్వాలని, ప్రభుత్వం అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. రైతులకు కనిపించే విధంగా, లైసెన్సులు,స్టాక్ బోర్డు, మైంటైన్ చేయాలని తెలిపారు. ఎవరైనా డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే,విత్తన చట్టం 1966 ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం ఎస్ఐ మురళీధర్ రాజ్,పిఎస్ఐ రవికుమార్,మండల వ్యవసాధికారి బి.వెంకన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి తహసిల్దార్ రామారావు



తరిగొప్పుల మే 30 మేజర్ న్యూస్ సూర్య రాజ్యాంగం కల్పించిన చట్టాల పైన ప్రతి ఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలని తరిగొప్పుల తహసిల్దార్ రామారావు అన్నారు శుక్రవారం రోజున పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు అనంతరం ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అందరికీ చేరుతున్నాయా ప్రతి పౌరుడు లింగభేదం లేకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని బడుగు బలహీన వర్గాలు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలన్నారు కులం పేరుతో దూషిస్తే వారు శిక్షకు అర్హులవుతారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ నెల్లూట్ల జానకి ఏఎస్ఐ రాజయ్య ఆర్ ఐ ఆంధ్రయ పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం..




కేసముద్రం, మే 30: కేసముద్రం మున్సిపల్ కేంద్రంలోని గాంధీ సెంటర్లో సిఐటియు 55వ, ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జల్లె జయరాజు సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. మే 30 1970లో సిఐటియు ఆవిర్భావ%శీ% నుండి నేటి వరకు ప్రజల, కార్మికుల, రైతుల సబ్బండ వర్గాల పక్షాన నిలబడి నిరంతరం వారి హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉందని అన్నారు. దేశంలో పాలకులు కార్మిక వర్గాలకు, ప్రజలకు, రైతులకు నష్టం చేకూర్చే నల్ల చట్టాలను అమలు చేయడానికి పూను కున్నారని వాటిని రద్దు చేసే వరకు పోరాటాలు నిర్వహించేందుకు కార్మికులు, రైతులు, ప్రజలు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాటోత్ మంగీలాల్ , బిర్రు కనక లక్ష్మి ,సుంచు కొమురయ్య,సుంచు శ్రావణ్ ,జాటోత్ శ్రీను,బి. వీరు నాయక్ ,తోడేటి సుగుణ ,మోరపాక సత్తమ్మ, తేళ్ల సుజాత , దుర్గం వెంకటమ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు కనీస మద్దతు ధర పెంచిన కేంద్ర ప్రభుత్వం...



### ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపిన రైతులు,బిజెపి శ్రేణులు..

### నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం..

కేసముద్రం, మే 30: ఖరీఫ్ సీజన్-2025-2026 లో 14 పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినేట్ నిర్ణయం పట్ల హకేసముద్రం మండల భారతీయ జనత పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఆద్వర్యంలో కేసముద్రం గ్రామ బస్టాండ్ సెంటర్, స్థానిక అంబేద్కర్ సెంటర్ లో ప్రధాని నరేంద్ర మోడీ చిత్ర పటానికి రైతులు, బిజెపి హశ్రేణులు క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భముగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడు తూ... జై జవాన్, జై కిసాన్ నినాదాలను సార్ధకం చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఒక వైపు దేశరక్షణలో రాజీలేని పోరాటం చేస్తూ శత్రు దేశాల నుండి దేశాన్ని హకాపాడుతూ, మరో వైపు దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రైతులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం రైతులకు మరో బహుమతిని ప్రకటించడం పట్ల యావత్ రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నదని అన్నారు.మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ.. మద్దతు ధరల పెంపు ద్వారా రైతుల ఆదాయం పెరిగి, వ్యవసాయ రంగాన్ని స్థిరంగా ఉంచటానికి దోహద పడుతుందని తెలిపారు.జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రధాని మోడీ నేతృత్వం లో ఎంఎస్పీ పెంపుతో పాటు రైతన్నలకు మేలు చేసే మరో హకీలక నిర్ణయం వడ్డీ రాయితీ పథకం కొనసాగింపు నిర్ణయాలు రైతులకు ఆర్థికంగా నిలువెత్తు భరోసాని చ్ఛేవిగా ఉన్నాయని,ఈ నిర్ణయం వల్ల పంటలు పండించడంలో భయం లేకుండా ముందు కెళ్లేందుకు దోహదం చేస్తుందని అన్నారు.జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొదిల నరసింహ రెడ్డి మాట్లాడుతూ.. కనీస మద్దతు ధర పెంపు నిర్ణయం తో రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా, పంటల ఎంపికలో స్పష్టతనూ ఇస్తుందని,రుతుపవనాల సీజన్ ప్రారంభానికి ముందే ఈ ప్రకటన రావడం వల్ల రైతులు ఎటువంటి పంటలు వేసుకోవాలో నిర్ణయించు కోవడంలో ఇది ఉపయోగ పడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి రామడుగు వెంకటాచారి, మండల ప్రధాన కార్యదర్శులు బోగోజు నాగేశ్వర చారి,బోనగిరి ఉపేందర్ ,బచ్చు లక్ష్మీనారాయణ , మండల కోశాధికారి లెంకలపల్లి శ్రీనివాస్, మంగిశెట్టి నాగయ్య, వేల్పుల ఐలయ్య, బొల్లోజు వీరన్న , సింగంశెట్టి మధు,పోలేపల్లి సంపత్ రెడ్డి ,దమ్మాటి దేవేందర్ ,పొదిల వెంకట్ రెడ్డి ,జుజ్జూరు వీరభద్ర చారి, రైతులు లక్కాకుల సత్యనారాయణ, బేతి వెంకన్న, పొదిల వెంకట్ రెడ్డి ,సోసుకండ్ల సంపత్ రెడ్డి, జూకంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు .

# కళ్యాణ లక్ష్మి,షాద్ ముబారక్,సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే.







బయ్యారం, మేజర్ న్యూస్ సూర్య మే 30.బయ్యారం మండల కేంద్రంలో సొసైటీ కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి, షాద్ ముబారక్ చెక్కులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా అమలు చేస్తున్న తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కీ కృతజ్ఞతలు తెలిపారు.కళ్యాణ లక్ష్మి, షాద్ ముబారక్ 45 చెక్కులు,సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు 61 మొత్తం 106 మంది లబ్దిదారులకు 61 లక్షల 95 వేల 836 రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో సిహెచ్. తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయ లక్ష్మి,సొసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్,చెరుకుపల్లి నరేందర్,జులకంటి సీతారాం రెడ్డి,కిషన్ నాయక్,సీఐ రవికుమార్,ఎస్ఐ తిరుపతి,తమ్మిశెట్టి వెంకటపతి,గుంజ వీరస్వామి,రాస మల్ల నాగేశ్వరరావు,పగడాల శ్రీనివాస్,ఎస్ కే బాబా,వీరబోయిన సంపత్,మండ నాగరాజు, పోతుగంటి సుమన్,బొమ్మ కంటి రాంబాబు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన జర్నలిస్టులు ఐక్యత చాటాలి



**- ఎంత అణచివేసిన వేసిన వృత్తి సక్రమంగా నిర్వహించాలి**

**- జిల్లా కాంగ్రెస్ నాయకులు రమేష్ నాయక్**

మరిపెడ,మే 30,మేజర్ న్యూస్(సూర్య):గిరిజన జర్నలిస్టులు ఐక్యతను చాటాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జరుపుల రమేష్ నాయక్ అన్నారు.శుక్రవారం మరిపెడ మండలం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో టిడబ్ల్యూజేఏ రాష్ట్ర రెండవ మహాసభ పోస్టర్ను ఆవిష్కరించి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన గిరిజన జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకొని వారి హక్కులను డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. వర్కింగ్ జర్నలిస్టులుగా పని చేస్తున్న ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు కల్పించే విధంగా కృషి చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను వర్తింపజేసి ఆదుకోవాలని అన్నారు.గిరిజనులు ఏ విషయంలో తక్కువ కాదని ఆయన గుర్తు చేశారు.మీ డిమాండ్లను నెరవేర్చాలంటే ఐక్యంగా ఉండి సాధించుకోవాలన్నారు. సమాజంలో వాస్తవాలను మాత్రమే ప్రచురణ చేసి ప్రజలకు చేరే విధంగా పనిచేసే గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. రాబోయే అక్రిడేషన్ కమిటీలో గిరిజనులకు స్థానం కల్పించి ప్రతి ఒక్క గిరిజన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు మంజూరు చేసే విధంగా కృషి చేయాలన్నారు. మరిపెడ మండలంలో పని చేస్తున్న గిరిజన జర్నలిస్టులకు ఇల్లు కేటాయించి వారిని ఆదుకోవాలి,గిరిజన జర్నలిస్టులకు ఏ ఆపద వచ్చిన నేను మీకు తోడుంటానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మాలోతు తిరుపతి నాయక్,జిల్లా ఈసీ మెంబర్లు మూడు శ్రీ కుమార్ నాయక్,ప్రవీణ్ నాయక్,రాజు నాయక్ ఉన్నారు

## జూన్ 1న గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు. గోపా హన్మకొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



హసన్‌పర్తి, మే 30, మేజర్ న్యూస్ (సూర్య). గౌడ కుటుంబంలో పుట్టిన నిరుపేద విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో చదివేందుకు గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) కృషి చేస్తుందని, అందులో భాగంగానే జూన్ 1న గోపా హన్మకొండ, వరంగల్ జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కార్ అవార్డులను ఇవ్వనున్నట్లు గోపా హన్మకొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు, గౌడ ప్రతిభా పురస్కారాల ప్రోగ్రాం కన్వీనర్, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఎంతో ఆశయంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలనే తపన ఉండి, కడు పేదరికంలో చదవలేని స్థితిలో ఉన్న విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలనే సంకల్పంతో గత 15 సంవత్సరాల నుండి గోపా ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న గౌడ విద్యార్థినీ, విద్యార్థులను 10వ తరగతిలో 600 మార్కులకు గాను 550 మార్కుల పైన ఇంటర్మీడియట్ లో 1000 మార్కులకు గాను 950 మార్కుల పైన వచ్చిన విద్యార్థులను గుర్తించి, వారిని పై చదువులకు పోవడానికి అన్ని రకాలుగా ప్రోత్సహించడానికి గౌడ విద్యార్థుల ప్రతిభా పురస్కార్ అవార్డులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే జూన్ 1న ఉదయం 10 గంటలకు హన్మకొండ లోని హంటర్ రోడ్ లో గల గౌడ హాస్టల్ భవనం నందు గౌడ ప్రతిభ పురస్కార్ అవార్డులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య గారు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు, వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కె.ఆర్ నాగరాజు గారు, గోపా రాష్ట్ర, వరంగల్ ఉమ్మడి జిల్లా బాధ్యులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గౌడ విద్యార్థినీ, విద్యార్థులు, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

## నూతన తహసిల్దార్ ను కలిసిన బిజెపి నాయకులు




కొత్తగూడ మే 30 (మేజర్ న్యూస్ (సూర్య)కొత్తగూడ మండలానికి బదిలీ పై వచ్చిన తహసీల్దార్ రాజు ను బీజేపీ గిరిజన మోర్చా వనభందు సెల్ రాష్ట్ర కన్వీనర్ బోడ.నవీన్ నాయక్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తహసీల్దార్ ను కొత్తగూడ మండలం లోని వారి కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలిసి, వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షులు యాదగిరి.మురళి, మాజీ మండల అధ్యక్షులు వాసం.మునిందర్, బీజేపీ మండల కోశాధికారి తుపాకుల.పరుశురాం, సేవాలాల్ సేన మండల అధ్యక్షులు బోడ. సుమన్ నాయక్,బజరంగ్ దళ్ మండల అధ్యక్షులు గూడూరు. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటమా ?

**- ఇళ్లపై నుంచి 33 కెవి లైన్ వేయొద్దని గతంలో ఏఈ ని కోరిన గ్రామస్తులు**

**- సరేనంటూ తలూపి గ్రామంలో టవర్ వేయిస్తానని ఏఈ హామీ**

**- మాట నిలబెట్టుకోని ఏఈ**



కమలాపూర్ మే 30 మేజర్ న్యూస్ సూర్య :- తమ ఇళ్లపై నుంచి 33 కె.వి విద్యుత్తు లైన్ వేయొద్దని కోరినప్పటికీ పట్టించుకోకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని కమలాపూర్ మండలం శనిగరం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లైను వేయొద్దని కమలాపూర్ ఏఈ కి శనిగరం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. సరేనంటూ తలూపి టవర్లు వేయిస్తానని హామీ ఇచ్చి కరెంటు పోల్ ద్వారానే మళ్ళీ లైన్ వేయడం గమనించిన గ్రామస్తులు అక్కడకు చేరుకొని పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఏఈ గ్రామం దాటే వరకు టవర్లు వేయిస్తానని చెప్పి కాలం వెళ్లదీసి ఇప్పుడేమో అసలు పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. గతంలో 11 కె.వి లైన్ వేస్తేనే పలువురికి గాయాలయ్యాయని అలాంటిది 33 కెవి లైన్ వేస్తే ఎలా బ్రతుకుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే తమ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు.

## మెట్టుగుట్టపై యాగశాలలో శ్రీరామ మూలమంత్ర హెూమం




కాజీపేట మే 30 మేజర్ న్యూస్ (సూర్య) వరంగల్ మహానగరంలో దక్షిణ కాశీగా పిలవబడే కాజీపేట మండలంలోని మడికొండ గ్రామంలో గల ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్ట శ్రీ సీతారామచంద్ర స్వామి మరియు శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సీతారామచంద్ర స్వామి జన్మ నక్షత్రం పునర్వసు శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి పంచామృత అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించడం జరిగింది. అనంతరం యాగశాలలో శ్రీ రామ మూల మంత్ర హెూమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త అనంతలక్ష్మి ఈ హెూమం లో పాల్గొనడం జరిగింది. అనంతరం ప్రవచనకర్త అనంతలక్ష్మి కి మరియు వచ్చిన భక్తులకు విష్ణువర్ధనాచార్యులు శ్రీ సీతారామచంద్రస్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కె శేషుభారతి, రామాలయం అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, రామలింగేశ్వర స్వామి ఆలయ అర్చకులు రాగిచెడు అభిలాష్ శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

# రామ్మూర్తి ఆశయాల సాధనకు కృషి చేద్దాం.



కొత్తగూడ మే 30( మేజర్ న్యూస్ (సూర్య)సిపిఐ ఎంఎల్ ప్రజా పందా సీనియర్ నాయకులు, అఖిలభారత ఐక్య రైతు సంఘం కొత్తగూడ మండల ఉపాధ్యక్షులు ఆకుతోట రామ్మూర్తి, ఆశయాలకు సాధన కోసం కృషి చేద్దామని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న అన్నారు. మండలంలోని గుండంపల్లి గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో గత వారం రోజుల క్రితం మరణించిన ఆకుతోట రామ్మూర్తి సంతాప సభ ను రైతు సంఘం మండల అధ్యక్షులు ముద్రబోయిన కొమ్మాలు, అధ్యక్షతన నేడు గొగ్గిళ్ళ లక్ష్మయ్య నగర్ లో జరిగింది. ముందుగా రామ్మూర్తికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రన్న మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా రామ్మూర్తి పార్టీ ప్రజా సంఘాలు నిర్వహించిన అనేక పోరాటాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారని అన్నారు. నిరుపేదలకు పోడు భూములు కొట్టించే సందర్భంలో, రైతాంగం,సమస్యలపై,వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలలో ఎంతో చురుకుగా పాల్గొన్నారు. ఈ క్రమంలో మిలిటెంట్ పేరుతో పోలీసుల వేధింపులు బెదిరింపులుఅనుభవించాడని అన్నారు.ఎంతో ధైర్యంగా పార్టీకి ముఖ్యంగా రహస్య దళాలకు తన సహాయం సహకారాలు నిత్యం అందించే వాడని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన నేటి తరుణం లో రామ్మూర్తి లాంటి భౌతికంగా దూరం అవటం తీరని లోటు అన్నారు. ప్రజా పరిపాలన పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు మరిచిపోయారని విమర్శలు చేశారు. ప్రజలు వర్గ పోరాటలలో చైతన్య%శీ% తో విముక్తి కై ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఐ ఎంల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సంయుక్త మండల కార్యదర్శి పూనెం ప్రభాకర్, మండల నాయకులు కంగాల పాపయ్య, మీసాల పాపయ్య,పి వై ఎల్ జిల్లా నాయకులు రాజబోయిన రాజు, పూనెం రవి తో పాటుగా వీరస్వామి, కొమ్మలు, రామస్వామి, సదానందం, శంకర్ రావు, సారయ్య, కొమ్మలు, రామయ్య తదితరులు పాల్గొన్నారు

# యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు





కమలాపూర్ మే 30 మేజర్ న్యూస్ సూర్య :- రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను కమలాపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దూడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దూడ శ్రీకాంత్ మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటున్నారని కొనియాడారు. ఉన్నత చదువులు చదివిన వ్యక్తి గా పేదల కష్టాల్లో అండగా నిలుస్తూ మంథని నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారన్నారు. గత శాసన సభ ఎన్నికల్లో తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం లో శ్రీధర్ బాబు పాత్ర కీలకం అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తో కలిసి రాష్ట్ర అభివృద్ధి, ఐటీ డెవలప్మెంట్ కోసం 24 గంటలు నిర్విరామంగా కష్టపడుతున్నారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, డైరెక్టర్ మిల్కూరు శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు చరణ్ పటేల్ సీనియర్ నాయకులు బాలసాని రమేష్, పోడేటి బిక్షపతి, కొండపాక మనీష్, విష్ణుదాసు వంశీధర్ రావు, మాట్ల రవీందర్, పెరుమండ్ల పరశురాములు, పైసా శరత్, ఆడేపు శ్రీకాంత్, ధర్మల శ్రీకాంత్, గూడెపు మొగిలయ్య, యుగేందర్, రాజు, ఆన్ కార్ అశోక్, మస్న చంద్రశేఖర్, మాట్ల రాజేష్, వైనాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ కు విద్య,అభివృద్ధిలో మొండి చేయి - యాసారపు కరుణాకర్



జనగామ టౌన్ మే 30(సూర్య):-జనగామ జిల్లా కేంద్రం లో రెండు వందల కోట్ల రూపాయలతో పెట్టాల్సిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జనగామ కు మంజూరు కాకపోవడం ఇక్కడి కాంగ్రెస్ నాయకుల చేతకానితనం మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు పట్టించుకోకపోవడం అని మాదిగ మేధావుల ఫోరం జనగామ జిల్లా కన్వీనర్ యాసారపు కరుణాకర్ దుయ్యబట్టారు. శుక్రవారం తను మాట్లాడుతూ జనగామ జిల్లా కేంద్రం లో మాట్లాడిన కరుణాకర్ ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్,పాలకుర్తి నియోజకవర్గాలలో నెలకొల్పడానికి అనుమతులు ఇచ్చారు కానీ జనగామ నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదు అని అన్నారు. జిల్లా కేంద్రం జనగామ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఎప్పుడు మంజూరు అవుతాయి ఇక్కడి విద్యార్థులు తల్లితండ్రులు వేయికండ్లతో చూస్తున్నారు అని అన్నారు. జనగామ నియోజకవర్గం లో కూలిపోయిన కల్వర్టు ల కు, చిటకోడూర్ వాగు మీద బ్రిడ్జి మరియు వడ్లకొండ గానుగుపహాడ్ మధ్యలో ఆగిపోయిన వంతెన పనులకు నిధులు మంజూరు కాకపోవడం అనుమతులు రాకపోవడం కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేతకానితనం మరియు స్థానికేతరుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎంఎల్ఏ కావడం అని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ నియోజకవర్గం లో ఇందిరమ్మ ఇండ్ల లిస్ట్ తయారు కాలేదు ఇండ్లకు ముగ్గులు పోయలేదు అని అసలు జనగామ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రం లో ఉన్నదా లేదా అని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికీ అయినా జనగామ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కాకపోతే జనగామ లో ఉన్న ప్రజా సంఘాలు,యువజన సంఘాలు జనగామ అభివృద్ధి నీ కోరుకునే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని జనగామ అభివృద్ధి కోసం ఎంత వరకైనా పోరాటం చేస్తామని జనగామ కాంటెస్ట్ ఎడ్ ఎంఎల్ఏ యాసారపు కరుణాకర్ అన్నారు.

## పాపం అక్షయ.. దాతలు ఎవరైనా ఆర్థిక సాయాన్ని అందించగలరు



గూడూరు మే 30 మేజర్ న్యూస్ (సూర్య): మండలంలోని ఎస్సీ కాలనీకి చెందిన వరికుప్పల దేవేందర్ రేణుకల కుమార్తె వరికుప్పల అక్షయ(12) గత ఐదు సంవత్సరాల నుండి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉండగా వారం రోజుల కిందట అక్షయ ఉదయం ముఖం కడుగుతూ ఉండగా కళ్ళు తిరిగి అకస్మాత్తుగా కింద పడిపోవడంతో అక్షయ తల్లిదండ్రులు అక్షయను హైదరాబాదులోని రెయిన్బో రోడ్ నెంబర్ వన్ ఆస్పత్రిలో చేర్పించగా ఆస్పత్రి డాక్టర్లు అక్షయ పరిస్థితి విషమంగా ఉందని ట్రీట్మెంట్ ఖర్చుతో కూడిందని తెలుపగా అక్షయ తల్లిదండ్రులు వారం రోజుల నుండి సుమారు 15 లక్షల రూపాయలు ఖర్చయ్యాయని నిరుపేద కుటుంబానికి చెందిన అక్షయ తల్లిదండ్రులు దాతలు ఎవరైనా ఉంటే తమ కూతురు అక్షయ ను కాపాడుకోవడానికి ఆర్థిక సహాయాన్ని అందించాలని వారు ప్రాధేయ పడుతున్నారు దాతలు ఎవరైనా ఉంటే 9908449056 ఈ నెంబర్ను సంప్రదించగలరు

# షీ టీమ్స్ ,డ్రగ్స్,సైబర్ నేరాల పై అవగాహన




మహబూబాబాద్ మే 30 మేజర్ న్యూస్ (సూర్య)ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు షీ టీం మహిళా ఎస్సై సునంద, సైబర్ క్రైమ్ ఎస్సై కరుణాకర్ సంయుక్తంగా ఏకశిల ఏంజెల్స్ స్కూల్ నిర్వహించుచున్నటువంటి గవర్నమెంట్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమం వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అధ్వర్యంలో షీ టీమ్స్, డ్రగ్స్,సైబర్ నేరాలపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి స్కూల్, కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా,ఏటీఎం కార్డ్ వివరాలు,ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దన్నారు. ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దనీ,మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని కోరారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై100 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు. షీ టీం ను సంప్రదించడానికి క్యూఆర్ కోడ్ విధానాన్ని ఫేస్బుక్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్ లకు ఉపయోగించుకోవాలని,అలాగే సోషల్ మీడియా లో కూడా షీ టీం ను సంప్రదించవచ్చని తెలిపారు. మానవ అక్రమ వివాహ రవాణా, ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ క్యూఆర్ కోడ్ పిటిషన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా అమ్మాయిలు వివిధ గ్రామాల నుండి వస్తుంటారు. ఎవరిని గుడ్డిగా నమ్మొద్దని,తమ వ్యక్తిగత విషయాలను, వ్యక్తిగత ఫోటోలని సోషల్ మీడియాలో గాని, ఇతరులకు గాని షేర్ చేయొద్దని,అట్టి ఫోటోలను అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేసే అవకాశం ఉంటుందన్నారు. కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ ఎవరైనా అలా బ్లాక్మెయిల్ చేసినట్లయితే పరువు పోతుందని భయపడకుండా షీ టీమ్ ని సంప్రదించాలని, షీ టీం కి కంప్లైంట్ చేసినట్లయితే కంప్లైంట్ యొక్క వివరాలు గొప్యం గా ఉంచబడతాయని, బాధితురాలు షీ టీమ్ ఆఫీస్ కి రాలేని పక్షంలో షీ టీం సభ్యులే వారి దగ్గరికి వెళ్తారని కావున ఎలాంటి భయం లేకుండా కంప్లైంట్ చేయాలని, షీ టీమ్ వాట్స్ అప్ నంబర్స్ 8712656935 కి తెలియచేసిన చో తగిన చర్య తీసుకుంటామని చెప్పారు.

వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డిపి లుగా పెట్టుకోవద్దని చెప్పారు.మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత,విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యతను ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దు, ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించొద్దన్నారు.యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. పుట్టిన తేదీలను,ఫోన్ నెంబర్లను పాస్వర్డ్ గా పెట్టుకోవద్దు అని సూచించారు.సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డ్ను పెట్టుకోవాలని అన్నారు.టి సేప్ యాప్ గురించి,దాని యొక్క పనితీరు గురించి దాన్ని ఒంటరిగా ప్రయాణించే మహిళలు, విద్యార్థినీ, విద్యార్థులు ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఫోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు, రోడ్డు భద్రతా నియమాల గురించి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది అరుణ, పార్వతి , రమేష్ పాల్గొన్నారు.

# సూర్య కథనానికి స్పందన





## వరి ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలి అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి

దంతాలపల్లి,మే 30 సూర్య (న్యూస్ ):దంతాలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి అన్నారు శుక్రవారం మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం తరలించకపోవడంతో కొద్దీ రోజుల క్రితం రైతులు రోడ్డెక్కి ధర్నా చేయడం సూర్య లో వచ్చిన కథనానికి అడిషనల్ కలెక్టర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కాంటాలు నిర్వహించి వెంటనే ధాన్యాన్ని తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి వాహిని, వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కఠిన చర్యలు తీసుకోబడతాయి...



మహబూబాబాద్ మే 30 మేజర్ న్యూస్ (సూర్య)బక్రీద్ సందర్భంగా గోవులను తరలించినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడతాయని రూరల్ సిఐ పి.సర్వయ్య తెలిపారు. జమండ్లపల్లి గ్రామం దగ్గర ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై వి.దీపిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



పెద్దవంగరమే 30 (సూర్య న్యూస్)మండలంలోని గంట్లకుంట గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన చింతల (రిక్కల) ఐలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె పార్థీవ దేహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముద్ధసాని సురేష్ పూలమాలవేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యాల పూర్ణచందర్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి జాను, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎరుకల సమ్మయ్య గౌడ్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్తినేని సోమయ్య, నాయకులు ఎండి పాషా, కన్నే సతీష్, బండి లచ్చయ్య బుచ్చి రాములు, యూత్ అధ్యక్షుడు కన్నె సంతోష్, కార్తీక్, రాకేష్ తదితరులు ఉన్నారు.

## పభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత ప్రజలు ప్రజాప్రతినిధులదే.

### -పాఠశాలల శాశ్వతదాత వేమిశెట్టి చంద్రయ్య



కురవి,మే 30 మేజర్ న్యూస్ (సూర్య ):ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత ప్రజలది ప్రజాప్రతినిధులదే అని మోద్దుగలగూడెం పాఠశాలల శాశ్వతదాత వేమిశెట్టి చంద్రయ్య అన్నారు.శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఉపాధ్యాయుల తల్లిదండ్రుల సమావేశంలో స్థానిక మోదుగుల గూడెం గ్రామపంచాయతీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సత్యనారాయణ చారి అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోదుగుల గూడెం పాఠశాలల శాశ్వతదాత వేమిశెట్టి చంద్రయ్య గారు మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర నర్సరీ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు తెలంగాణలో పుట్టిన చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తుందని వారన్నారు ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా బీటెక్ విద్యను అందిస్తుందని ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఫ్రీ మెట్రిక్ స్కాలర్షిప్స్ తో పాటు మధ్యాహ్న భోజనం ఉచిత నోట్ పుస్తకాలు పాఠ్యపుస్తకాలు అందిస్తుందని కంప్యూటర్ విద్య అందించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందని కావున ప్రజలారా మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వాటిని బ్రతికించాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్ పర్సన్స్ కొత్త శారద , షేక్ మైబా గ్రామ పెద్దలు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గుణాత్మక విద్యను అందుబాటులోకి తీసుకురావాలి...







మహబూబాబాద్ మే 30 మేజర్ న్యూస్ (సూర్య) ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణా ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏకశిలా ఏంజెల్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ లో జిల్లా విద్యాశాఖాధికారి ఏ.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణను ప్రతి ఉపాధ్యాయుడు సక్రమంగా వినియోగించుకోవడం వల్ల తరగతి గదిలో ఒక మంచి టీచింగ్ లెర్నింగ్ ప్రాసెస్ ను కల్పిస్తుందని, శిక్షణ లో నేర్చుకున్న అంశాలను బాగా ఆకళింపు చేసుకుని గుణాత్మక విద్య అందుబాటులోకి తీసుకు రావడానికి ఇంకా ఎలాంటి అంశాలు జోడిస్తే మీ పాఠశాలకు అనుగుణంగా ఉంటుందో వాటిని మేళవించి మీ బోధనా అభ్యసన ప్రక్రియ ఫలవంతం చేసుకోవాలని, రాబోయే విద్యా సంవత్సరం కూడా గత విద్యా సంవత్సర ఎస్ఎస్సి ఫలితాల వలె రాష్ట్ర స్థాయి లో ప్రథమ స్థానం పొందాలని మన బడి మన బాధ్యత గా రాబోయే బడి బాట కార్యక్రమం లో పిల్లలను మన పాఠశాలలో చేరేలా ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పని చేసి ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు. శిక్షణ విజయవంతంగా ముగించిన డి ఆర్ పి లను, శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ శిక్షానార్థులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆజాద్, జిల్లా సైన్స్ అధికారి బి. అప్పారావు, ఎసిజి మందుల శ్రీరాములు, సతీష్, ప్రవీణ్,సదయ్యలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన





### -నిరుపేదలజీవితాల్లో వెలుగులు నింపుతున్న ప్రభుత్వం.

### -ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామ చంద్రు నాయక్.

కురవి,మే 30 మేజర్ న్యూస్ (సూర్య): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ప్రజా ప్రభుత్వపాలన ప్రతి ఇంటా అభివృద్ధి చేకూరేలా ప్రభుత్వం చేపట్టిన పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ సానుకూల మార్పులకు నాంది పలుకుతున్నాయని ప్రభుత్వ విప్ మరియు డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రు నాయక్ పేర్కొన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్, ఇందిరమ్మ ఇండ్ల పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులు,ప్రొసీడింగ్ పట్టాలు పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ప్రభుత్వ విప్ మరియు డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రు నాయక్ మాట్లాడారు. ..ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు అత్యవసర ఆర్థిక సహాయం అందించారని పేర్కొన్నారు.ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద పలువురు లబ్ధిదారులకు గృహ నిర్మాణ పట్టాలు అందించగా, రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాల బాటలో దారి చూపించాయని అన్నారు.మహోత్తర కార్యక్రమానికి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కాంగ్రెస్ నేతలు, యువ కాంగ్రెస్ నాయకులు, గ్రామ అధ్యక్షులు, బి ఎల్ ఏ లు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. నాయకులు ప్రజలతో మమేకమవుతూ, వారి అనుభూతులు పంచుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.రాష్ట్ర వ్యాప్తంగా పల్లె ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. పేదల ఆశలు తీరేలా, వృద్ధుల గౌరవాన్ని కాపాడేలా, యువత భవిష్యత్తును నిర్మించేలా కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజలతో పాటు ఉందని చెప్పారు. ఇది తమ సేవా యాత్రలో మరో మైలురాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లోఉభయ మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం, కొండపల్లి కరుణాకరరెడ్డి, పి ఏ సి సియస్ గుండ్రతిమడుగు చైర్మన్ గార్లపాటి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి, రామునాయక్, అవిరె మోహనరావు, తుకారాం నాయక్,ఆలయ కమిటీ చైర్మన్ కోర్ని రవీందర్ రెడ్డి, కురవి టౌన్ అధ్యక్షులు రాజేందర్ నారాయణ, ఎంపిడిఓ వీరబాబు, ఎం ఆర్ ఓ లు విజయ, పున్నం చందర్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ రవి, పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సుదర్శన చక్ర కళావాహన హెూమం....





### జూన్ 3,4,5 తేదీలలో సుదర్శన చక్రం పునః ప్రారంభోత్సవాలు

మహబూబాబాద్ మే 30 మేజర్ న్యూస్ (సూర్య)మానుకోట పట్టణంలోని సుమారు ఆరు శతాబ్దాల అతి పురాతన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో భిన్నమైన సుదర్శన చక్రం పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆలయ విమాన గోపురంపై ఏర్పాటు చేసిన సుదర్శన చక్రం భిన్నమైన నేపథ్యంలో అదే స్థానంలో నూతనంగా మరో సుదర్శన చక్రాన్ని పునః ప్రతిష్ఠించడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీ నారాయణాచార్యుల నేతృత్వంలో వేదమూర్తులు ప్రత్యేక ఆద్యాత్మిక కార్యక్రమాలను రూపొందించారు. జూన్ 3,4,5వ తేదీలలో పునః ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా గురువారం భిన్నమైన సుదర్శన చక్రంను ప్రత్యేక పూజలు చేపట్టి తొలగించారు. భిన్నమైన సుదర్శన చక్రంలో ఉన్న మంత్రపూరిత శక్తిని కలశమునందు ఆహ్వానించి గర్భాలయంలో భద్రపరిచారు. కార్యక్రమంలో కళావాహన హెూమం అత్యంత భక్తి శ్రద్ధలతో వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జై శ్రీమన్నారాయణ అంటూ భక్తులు స్వామివారి నామ స్మరణగావించారు. ఈ సందర్భంగా అర్చకులు ముడుంబై లక్ష్మీ నారాయణాచార్యులు మాట్లాడుతూ అతి ప్రాచీనమైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవాలయమున అర్చామూర్తిగా వేంచేసియున్న స్వామి వారి చల్లని చూపుతో మన పూర్వీకులతో పాటు మనము



కూడా వారి అనుగ్రహముతో తరించిన వారమేనన్నారు. అనుక్షణం మన రక్షణకై మనపై కరుణామృతమును కురిపించే స్వామివారికి ఎల్లవేళలా మంగళము కలగాలని ( వారు చల్లగా ఉంటే మనము చల్లగా ఉంటాము ) ఆశిస్తూ వారి సన్నిధిలో జరుపబోవు సుదర్శన చక్ర పున: ప్రతిష్ట మహెూత్సవంలో పాల్గొని యధాశక్తి కైకర్యాన్ని అందించి ఇట్టి మహెూత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వారికి సహకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు గౌతమ్ పురోహిత్, దత్తు, ఆలయ కమిటీ నిర్వాహకులు చాపల బాపురెడ్డి, సింగ మనోహర్, మొగిలి ప్రసాద్ రెడ్డి, కొల్లూరు రవికుమార్, ఇనుగాల సుధాకర్ రెడ్డి, గాంతి మధుసూదన్ రెడ్డి, మొగిలి మధుకర్ రెడ్డి, పరకాల ఉపేందర్ రెడ్డి, బోనగిరి గిరిధర్ గుప్తా, కైరంకొండ లలిత, బవిరిశెట్టి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## మూగ జీవాలను హింసిస్తే సహించేది లేదు.

### -గోవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు.

### -మహబూబాబాద్ రూరల్ సి ఐ సర్వయ్య.



కురవి మే 30,మేజర్ న్యూస్ (సూర్య ):మూగ జీవాలను హింసిస్తే సహించేది లేదని మహబూబాబాద్ రూరల్ సి ఐ సర్వయ్య అన్నారు. శుక్రవారం అక్రమంగా గోవుల రవాణా నివారణకు కురవి మండల కేంద్రము ప్రధాన రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద కురవి పోలీస్ వారి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసినచెక్ పోస్ట్ ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సి ఐ మాట్లాడారు. అక్రమంగా గోవులను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమం లో కురవి పి ఎస్సై కృష్ణ రెడ్డి, ఏ ఎస్సై వెంకన్న, హెచ్ సి శ్రీనివాస్ గన్ మెన్ లింగయ్య,పి సి కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని తహసిల్దార్ కు వినతి

### అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణలో ఉద్యమకారులకు గుర్తింపు లేదు

### ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాపాక శ్రీశైలం



దేవరుప్పుల మే 30 మేజర్ న్యూస్ (సూర్య):కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో అమరులైన కుటుంబాలకు, ఉద్యమకారులకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాపాక శ్రీశైలం ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం పలువురు ఉద్యమకారులు స్థానిక తహసిల్దార్ ఆడెపు అండాలు ను కలిసి తెలంగాణ ఉద్యమకారుల హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాపాక శ్రీశైలం మాట్లాడుతూ అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు గుర్తింపు కరువైందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఉద్యమకారులను గుర్తించి వారికి అండగా ఉంటామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటనలు చేసి అధికారంలోకి వచ్చి ఇప్పటికి రెండు సంవత్సరాలు కావస్తున్న ఉద్యమకారులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడం దారుమని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం, పునర్నిర్మాణమే ధ్యేయంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలలో ఉద్యమకారుల హామీలను ప్రకటించి అమలు చేయాలని అన్నారు. లేని పక్షంలో ఉద్యమకారులందరం విడతల వారీగా మరో పోరాటానికి సిద్ధమవుతామని అన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న బాకరం లావణ్య మాట్లాడారు. కార్యక్రమంలో మేడ సురేష్ మహాజన్ కత్తుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సాగు సమయాన.. రైతన్నలు జాగ్రత్త..



### విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి

### నకిలీ, కల్తీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం సమగ్రమైన విత్తన చట్టం తేవాలి

### రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ శోభన్

దేవరుప్పుల మే 30 మేజర్ న్యూస్ (సూర్య):వానాకాలం సాగు సమయాన రైతన్నలు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ శోభన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ను తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమయ్య, భూక్యా చందు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు సారయ్యతో కలిసి శోభన్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన విత్తన కంపెనీలతో రైతులు మోస పోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం నకిలీ విత్తనాలను కల్తీ విత్తనాలను అరికట్టడంలో సమగ్రమైన విత్తన చట్టం తీసుకురావాలని, అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాణ్యమైన విత్తనాలను సన్నా చిన్నకారు రైతులకు సబ్సిడీపై అందించాలని, రాష్ట్రంలో నకిలీ కల్తీ విత్తనాలను అరికట్టడానికి క్యూఆర్ కోడ్ సాఫ్ట్ వేర్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువులు కొనే ముందు లైసెన్స్ కలిగిన డీలర్ నుంచే ఎరువులు కొనుగోలు చేయాలని అన్నారు. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల బస్తాలనే కొనుగోలు చేయాలి. ఎరువుల బస్తాకు చేతికుట్టు ఉంటే సీలు ఉందో లేదో చూసుకోవాలని, చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దని అన్య పదార్థాలు కలిస్తే ఎరువును కల్తీగా గుర్తించాలన్నారు. కొనుగోలు చేసే సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి. లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన సమయంలో బిల్లులను సరిచూసుకోవాలని,బిల్లుపై దుకాణం పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు గ్రామం పేరు విక్రయదారుడి సంతకం, తేదీలు, విత్తన రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయెూ లేదో సరిచూసుకోవాలని కోరారు. పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుండి విత్తనాలు కొనుగోలు చేయ్యేద్దు. విత్తన ప్యాకెట్, సీసా, బస్తా, డబ్బాలకు సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాల తెలిపారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం.. శుభాకాంక్షలు.. పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్



దేవరుప్పుల మే 30 మేజర్ న్యూస్ (సూర్య):దేవరుప్పుల మండలంలోని పొట్టి గుట్ట తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సునావత్ ఈర్య-సరోజ దంపతుల కూతురు ప్రత్యుష-చంటి ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసంపల్లి మహేందర్ చింత ఎల్లయ్య తోటకూరి రమేష్ రుద్రోజు చారీ గోడిశాల శ్రీనివాస్ చంద్రు నాయక్ కాలు నాయక్ బాలు నాయక్ పొట్టి గుట్ట తండా యూత్ అధ్యక్షుడు సునావత్ వినోద్ పెద్ది రంజిత్ గౌడ్ అశోక్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక రాజ్య స్థాపన కోసం సిఐటియు పోరాటం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో సిఐటియు జెండా ఆవిష్కరణ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న



పాలకుర్తి మే 30 మేజర్ న్యూస్ (సూర్య)కార్మిక రాజ్య స్థాపన కోసం సిఐటియు పోరాటం చేస్తుందని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న అన్నారు. శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గం లో సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఐటియు జెండాను సోమన్న ఆవిష్కరించారు. అనంతరం వారు పాల్గొని మాట్లాడుతూ. దేశంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా సిఐటియు సమరశీల కార్మిక పోరాటాలు నిర్వహించి, దోపిడీ యాజమాన్యాలను ఎదిరించి కార్మిక వర్గానికి అండదండగా ఉన్నదన్నారు. 1970 మే 30న భారతదేశ కార్మిక వర్గానికి ఐక్యత. పోరాటం అనే నినాదంతో సిఐటియు ఆవిర్భవించిందని అన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న పాలక వర్గాలపై చారిత్రాత్మక సమ్మె పోరాటాలు నిర్వహించి కార్మిక వర్గానికి మనోధైర్యాన్ని కల్పించి కార్మికుల హక్కుల సాధన కోసం దిక్సూచిగా సిఐటియూ నిలిచిందన్నారు.కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కాలంలో స్వాతంత్రం పూర్వం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు పాతరేసి ఈ దేశంలో బడా కార్పొరేట్ శక్తులు కార్మికుల శ్రమ శక్తిని యధేచ్ఛగా శ్రమదోపిడి చేసేందుకు నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొచ్చారని విమర్శించారు.కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసేంతవరకు కార్మిక వర్గం భారత పాలక వర్గాలపై పెట్టుబడిదారుల పై పోరాటాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని. కార్మిక వర్గం ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏనుగతల వెంకన్న, పెద్దాపురం, కుమార్, ఎల్లయ్య, ఉప్పన్న,సమయ్య, సోమ చంద్రు, తోటరాజు, పెండ్లి భాస్కర్, రాచర్ల రాజు, అబ్బాస్,తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లను ఇస్తాం





## దోర్నకల్ నియోజకవర్గంలో అర్హులకు సంక్షేమ పథకాలు వర్తిస్తాయి ప్రభుత్వ విప్,దోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్

దంతాలపల్లి,మే 30 (సూర్య న్యూస్) : ప్రజా సంక్షేమమే... ప్రభుత్వ ధ్యేయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి - సంక్షేమ పథకాలతో ప్రతి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలుపాలనే ధ్యేయంతో పని చేస్తున్నారని,ప్రజల మీద భారం వేయకుండా ఇచ్చిన హామీలో భాగంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రం ముందుకు సాగుతుందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్స్,కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోర్నకల్ నియోజకవర్గంలో ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు,తెలంగాణ ఉద్యమకారులకు, జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి వారి సొంతింటి కలను నెరవేర్చడానికి కృషి చేస్తున్నానని అన్నారు. మండలంలో 185 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రొసీడింగ్,13 మంది కళ్యాణ, షాదీ ముబారక్,40 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చురుగ్గా పాల్గొని లబ్దిదారులు సక్రమంగా ఇళ్లను నిర్మించుకునే విధంగా చూడాలని, ఇళ్ల నిర్మాణానికి ఇసుక,సిమెంటు,వగైరా సరుకులను ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్దిదారులకు చేరేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రేషన్ కార్డులు లేని లబ్దిదారులకు రేషన్ కార్డు ఇస్తూ సన్న బియ్యం ఇస్తున్నామని,రైతులకు రుణమాఫీ,రైతు బంధు,సన్న వరి పంటకు క్వింటాకు రు.500 బోనస్,మహిళలకు వడ్డీ లేని రుణాలు,ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, బీసీ కుల గణన,ఎస్సీ వర్గీకరణ చేసి,,బంజార భాషను 8 వ షెడ్యూల్ చేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.కార్యక్రమంలో తహసిల్దార్ ఉప్పుల సునీల్ రెడ్డి,ఎంపీవో అప్సర్ పాషా,తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు భట్టు నాయక్,డైరెక్టర్ కొమ్ము వాసు, పిఏసిఎస్ చైర్మన్ సంపేట రాము గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కొమ్మినేని సతీష్,ఆవుల సురేష్,మండల యూత్ అధ్యక్షుడు సంపేట సురేష్ గౌడ్,రామ్ రెడ్డి,శంకర్,పొన్నోటి బాలాజీ, బొల్లు వీరన్న ,సంపత్,శ్రీనివాస్ రెడ్డి,కొత్త కొమురెల్లి,నెమ్మది యాకన్న,నవీన్ రెడ్డి,రమేష్ రెడ్డి,మల్లం శ్రీను, దుండి వెంకటేశ్వర్లు ,కారుపోతుల అనిల్,ఏరుకొండ యాకన్న గందసిరి లక్ష్మణ్, కారుపోతుల జంపయ్య,దైద ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాద్రిపేటలో ఎల్లమ్మ గుడికి భూమి పూజ...



స్టేషన్ ఘనపూర్ (చిల్పూర్) మే 30, మేజర్ న్యూస్(సూర్య):జనగామ జిల్లా చిలుపూరు మండలం వెంకటాద్రిపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ ఎల్లమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ (శంకుస్థాపన ) శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈ భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎన్నకూస కుమార్,గౌడ సంఘం అధ్యక్షుడు రాజు,కందుల రఘుపతి, గౌడ సంఘం నాయకులు తాడగోని లక్ష్మీనారాయణ, రవీందర్, చింత సమ్మయ్య, కేశవులు, గుర్రం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## దంతాలపల్లి ఫర్టిలైజర్ షాపుల తనిఖీ
### -జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల



దంతాలపల్లి మే30 (సూర్య న్యూస్):మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీ లలో భాగంగా వారు ఫర్టిలైజర్ గోడౌన్స్ ను పరిశీలించి స్టాకు వెరిఫికేషన్ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాల అమ్మకం ప్రారంభమైనందున విత్తన డీలర్లు అందరూ తప్పకుండా రసీదులను రైతులకు అందించాలని,స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు మైంటైన్ చేస్తూ ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించడం జరిగింది. విత్తనాలు కొనుగోలు చేసే రైతులందరూ తప్పకుండా లైసెన్డ్ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని,ఇతర వ్యక్తుల వద్ద తీసుకోకూడదని తెలియచేయడం జరిగింది.

ఈ తనిఖీలలో భాగంగా వారి వెంట మండల వ్యవసాయ అధికారి పి. వాహిని మరియు వ్యవసాయ విస్తరణ అధికారులుదీక్షిత్, శిరీష తదితరులు పాల్గొన్నారు పాల్గొనడం జరిగింది.

## భాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



పాలకుర్తి మే 30 మేజర్ న్యూస్ (సూర్య)పాలకుర్తి పట్టణ కేంద్రానికి చెందిన ధారణ లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ పరామర్శించి ,25 కిలోల బియ్యం,కూరగాయలు,నిత్యావసరాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలోట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జీడి హరీష్, కోశాధికారి ఒర్రె కుమారస్వామి, ట్రస్ట్ ప్రతినిధులు తాళ్లపల్లి రత్నాకర్ పెండ్లి భాస్కర్ మరియు మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి ఫోటో గ్రాఫర్ పై దాడిని ఖండించిన పాలకుర్తి మండల ఫోటో గ్రాఫర్లు..




పాలకుర్తి మే 30 మేజర్ న్యూస్ (సూర్య)హైద్రాబాద్ లోని మేడిపల్లిలో ఫోటో గ్రాఫర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాలకుర్తి మండల ఫోటో యూనియన్ సభ్యులు అన్నారు. శుక్రవారం పాలకుర్తి మండలకేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైద్రాబాద్ లోని మేడిపల్లిలో ఫోటో గ్రాఫర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గజ్జి రాజు,జిల్లా ఉపాధ్యక్షుడు పట్టూరి శ్రీను,కోశాధికారి బాబు,సభ్యులు బొమ్మగాని ప్రదీప్ కుమార్,వర్ధమాన్ శ్రీనివాస్,సతీష్,నాని, సంతోష్,శ్రీకాంత్,సోమేశ్వర్,శేఖర్,రమణ,సురేష్,రమేష్,మహేందర్,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య అందుతుంది....




స్టేషన్ ఘనపూర్, మే30,మేజర్ న్యూస్(సూర్య):జనగామ జిల్లాస్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిగ్రామంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత కార్యదర్శి గోరంట్ల యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యువజన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల శివుని పల్లి ప్రధానోపాధ్యాయుడు కుసుమ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థిని విద్యార్థులు ఎవరు కూడా ఫీజులు కట్టి చదువులు కొనవద్దని ప్రభుత్వ బడిలో ఫ్రీగా చదువుకోవాలని అన్నారు. శివుని పల్లి ఉన్నత పాఠశాల లో 2024-2025 సవంత్సర పదవ తరగతి విద్యార్థులు 49మందితో 100శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు అర్హతలు,అనుభవం,అంకిత భావం గల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని,ఎలాంటి ఖర్చు లేకుండా విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత నోట్ పుస్తకాలు, రెండు జతల ఉచిత దుస్తులు అందించడం జరుగుతుందని తెలిపారు. అన్ని తరగతుల విద్యార్థులకు డిజిటల్ తరగతులు అందుబాటులో ఉన్నాయని,శుభ్రతతో సన్న బియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వారానికి మూడు సార్లు కోడిగుడ్లు, బెల్లం రాగి జావా అందచేయడం జరుగుతుందన్నారు. దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం అందించడం అలాగే బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్, కరాటే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని,ఐదు వందల పుస్తకాలతో లైబ్రరీ, విశాలమైన ఆటస్థలం, 160ప్రయోగ పరికరాలతో అధునాతన అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉందన్నారు. ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్యా అందుతుందని మన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివుని పల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ చెన్నూరి వెంకటేశ్వర్లు, పెద్దమ్మతల్లి దేవాలయ కమిటీ కార్యదర్శి కొండ వేణు,యువజన సంఘం సభ్యులు భూషెట్టి సురేష్,పిట్టల అనిల్,పిట్టల అజయ్,దారం నాగరాజ్,తోట వేణు,కొండ రాజు,కోలబాలరాజు, రాజు,గ్రామ పెద్దలు రేగుల శ్రీనివాస్, చెన్నూరు సత్య నారాయణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం శ్రీనాథ్,లక్ష్మీ ప్రసాద్, శ్రీనికాంత్, కొండ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహంకాళి అమ్మవారి తిరుగు పండుగ...



స్టేషన్ ఘనపూర్,మే30,మేజర్ న్యూస్(సూర్య):జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం సముద్రాల గ్రామంలో మహంకాళి అమ్మవారి తిరుగుపండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి అభిషేకాలు జరిపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మించిన కుందూరు నాగమణి సోమిరెడ్డి దంపతులు,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ ఇనుగాల లలిత దేవి,మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ ఇనుగాల వెంకటేశ్వర రెడ్డి,మాజీ సర్పంచులు గుండె విమల నర్సయ్య,తాటికొండ కుమారస్వామి, గ్రామస్తులు పాల్గోన్నారు.

# ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన డిసిపి రాజమహేంద్ర నాయక్



పాలకుర్తి మే 30 మేజర్ న్యూస్ (సూర్య) పాలకుర్తి మండలంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యం లో పాలకుర్తి మండలంలో ఫర్టిలైజర్స్అండ్ పెస్టిసైడ్ షాప్ లను ఆకస్మిక తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు,అవుట్ డేటెడ్ విత్తనాలు తనిఖీ చేసి విత్తన షాపు ల లోని స్టాక్ రిజిస్టర్, సేల్ రిజిస్టర్ మరియు విత్తన ప్యాకెట్ లను తనిఖీ చేసి షాపు యాజమానులతో మాట్లాడి నకిలీ విత్తనాలు అవుట్ డేటెడ్ విత్తనాలు అమ్మితే వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేయడం జరుగుతాయని ఆయన హెచ్చరించారు. ఇట్టి తనిఖీలో వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, జనగాం జిల్లా అగ్రికల్చర్అధికారి పరుశురాం నాయక్ ,ఏ.డి.ఏ రామారావు , మరియు పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి శరత్ చంద్ర,పాలకుర్తి ఎస్సైలు దూలం పవన్ కుమార్,లింగారెడ్డి, ట్రైనింగ్ ఎస్సై రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.